జిల్లా రెవెన్యూ అధికారిగా విశ్వేశ్వరనాయుడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారిగా ఏపీసీఆర్ డీఏ యూనిట్-8లో పనిచేస్తున్న విశ్వేశ్వరనాయుడిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీఆర్వోగా పనిచేస్తున్న గంగాధర్‌గౌడ్ బాపట్లకు బదిలీ అయ్యారు. జీఎన్ఎస్ఎస్ పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాస్‌ను గుంటూరు డీఆర్వోగా, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంచాలకులుగా పనిచేస్తున్న రోహిణిని కృష్ణా జిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ఠ ఏర్పాట్లు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వచ్చే నెల 10వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని బాధ్య కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ర్యాలీ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్, మేజర్ అమర్‌దీప్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అదితిసింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా ఆర్మీలో ప్రవేశాలకు ఇప్పటికే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సామర్థ్య పరీక్షలు నవంబరు 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారని చెప్పారు. దీనికి సంబంధించి కడప మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. గుడారాలు, బారికేడ్లు, విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్ల పనులు ఆరో తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పలు అంశాలపై ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ పునీత్‌కుమార్, మెడికల్ అధికారి మేజర్ అమర్‌దీప్ వివరించారు. అనంతరం కడప మున్సిపల్ స్టేడియాన్ని పరిశీలించారు. ఎస్పీ ప్రకాశ్‌బాబు, కడప ఆర్డీవో ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపకాధికారి ధర్మారావు, ఎల్ఎంవీఐ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న బాధ్య కలెక్టర్ అదితిసింగ్, కల్నల్ పునీత్‌కుమార్, కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు



కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీ హర్ష వర్ధన్‌రాజుకు సమస్యను వివరిస్తున్న మహిళలు

మత్తు నుంచి మా పిల్లలను కాపాడండి

కడప ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎస్పీని కలిసిన తల్లులు

-న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

గంజాయి, మత్తు పదార్థాలకు తమ పిల్లలు బానిసయ్యారని, వీటిని అరికట్టి, వారిని కాపాడాలని కడప నగరానికి చెందిన పలువురు మహిళలు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు విన్నవించారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం వారంతా ఎస్పీని కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్తుకు అలవాటైన యువకుల భవిష్యత్తుపై ముందుకొచ్చి వారిని కాపాడాలని కోరుతున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో యువతను మత్తుకు బానిసలుగా చేశారని ఆరోపించారు. వైద్యులు చీటీ లేనిదే దుకాణాల్లో మందులు ఇవ్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కడప నగరాన్ని గంజాయి, మత్తు పదార్థాల నుంచి కాపాడాలని కోరారు. ఈ విషయంపై ఎస్పీ స్పందిస్తూ ఔషధ దుకాణదారులను పిలిపించి సమావేశం నిర్వహిస్తామని, గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



మత్తు మందులు

భయం వేస్తోంది

మత్తు, గంజాయికి అలవాటు పడిన పిల్లలు డబ్బుల కోసం మాపైనే దాడులకు పాల్పడుతున్నారు. వీటి నుంచి వారికి విముక్తి కల్పించాలి. రోజురోజుకూ భయమేస్తోంది. బాధ కలుగుతోంది. - యువకుడి తల్లి, కడప

గుండె తరుక్కుపోతోంది

మా పిల్లలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి ఏం చేస్తున్నారో వారికే అర్థం కావడం లేదు. డబ్బులు ఇవ్వకుంటే మాపైనే దాడులకు పాల్పడుతున్నారు. కొంతమంది మందుల దుకాణదారులు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారు. కొంతమంది సూదుల ద్వారా మత్తు ఎక్కించుకుంటున్నారు. **- యువకుడి తల్లి, బిస్మిల్లానగర్**

వేల రూపాయలు వెచ్చించి...

పిల్లలు పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నారు. మత్తు మందులను తాడిపత్రి, కర్నూలు అనంతపురం నుంచి కొనుగోలు చేస్తున్నారు. వీరి బలహీనతను ఆసరా చేసుకుని అక్రమార్కులు వేల రూపాయలు దండుకుంటున్నారు. బిస్మిల్లానగర్, యానాదికాలనీ, గౌస్‌నగర్ తదితర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు దొరుకుతున్నాయి. **- యువకుడి తల్లి, గౌస్‌నగర్**

గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతల అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. భారీగా భూదోపిడీకి పాల్పడ్డారు. భూదందా నిగ్గు తేల్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఉమ్మడి కడప జిల్లాలో ఆ పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి వెంచర్లు వేశారు. కడప నగర పరిసరాల్లోనే 400 వరకు అక్రమ లేఅవుట్లు వేసినట్లు ఉన్నతస్థాయి విచారణలో తేలింది. ప్రభుత్వ భూములనే కాదు.. చివరకు సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి జలవనరులైన చెరువులనూ ఆక్రమించేశారు. 2019-24 మధ్య సాగిన భూదందాలు, వీటిలో వేసిన వెంచర్లు, వాటి విలువ లెక్కించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

-ఈనాడు, కడప



బద్వేలులో అనధికార లేఅవుట్

అధికారమే అండగా... ఆక్రమణలు దండిగా!

- ఉమ్మడి కడప జిల్లాలో వైకాపా నేతల భూదందా
- సింహభాగం కబ్జాలు కడప నగర పరిసరాల్లోనే...
- రాష్ట్రప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన విచారణ కమిటీ

ఉమ్మడి కడప జిల్లాలో వైకాపా నేతల భూదందాలు, అక్రమ లేఅవుట్లపై వెల్లువెత్తిన ఫిర్యాదులపై పురపాలకశాఖ మంత్రి నారాయణ తీవ్రంగా స్పందించారు. టౌన్ ప్లానింగ్ రాష్ట్ర అదనపు డైరెక్టర్ నాగసుందరి నేతృత్వంలో విచారణ బృందాన్ని నియమించి సమగ్ర దర్యాప్తు చేయించారు. అధికారులు పది బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో అక్రమ లేఅవుట్లపై విచారణ ప్రారంభించారు. ఉమ్మడి కడప జిల్లాలో 585 అక్రమ లేఅవుట్లను గుర్తించడంతోపాటు వాటి విలువ రూ.800 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా వేశారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమార్కులకు కొమ్ము కాయడంతోనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, కబ్జా చేసిన స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారం పేరిట వెంచర్లు వేసి భారీగా సొమ్ము చేసుకున్నారని పేర్కొన్నారు. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, రాయచోటి, కమలాపురం నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అక్రమ లేఅవుట్లు వెలిసినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీంతో మేల్కొన్న అధికారులు కడప, బద్వేలులో అనధికార వెంచర్లు, లేఅవుట్ల వివరాలను వెల్లడించి వీటిని ఎవరూ కొనుగోలు చేయొద్దని కొనుగోలుదారులను హెచ్చరించారు.



దేవుని కడప చెరువు భూమిలో నిర్మించిన ఇళ్లు

- కడప నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను నలుగురు వైకాపా ముఖ్య నాయకులు దోచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ పార్టీ కార్పొరేటర్లు సైతం తామేమీ తక్కువ కాదన్నట్లు అక్రమ వెంచర్లు వేసుకున్నారు. ఆ పార్టీ హయాంలో ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా వాసి అనే ధైర్యంతో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలు, భూములను కబ్జా చేసి వెంచర్లు వేశారు. వీరికి కడపలో ఎన్నికలకు ముందు వరకు నాలుగేళ్లపాటు పనిచేసిన ఓ తహసీల్దారు సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- కడప నగరంలోని రింగ్‌రోడ్డు చుట్టూ వైకాపా నాయకులు దాదాపు 500 ఎకరాలను ఆక్రమించుకుని వెంచర్లు వేశారు. రూ.వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి తమ వశం చేసుకున్నారు. కబ్జా చేసిన భూముల్లో వెంచర్లు వేశారు. కడప చుట్టూ వెలిసిన 400 వెంచర్లలోని లేఅవుట్లకు ఎలాంటి అనుమతుల్లేవని సమాచారహక్కు చట్టం దరఖాస్తుకు అందిన సమాధానంతో వెల్లడైంది. వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్లు ఒక్క కడప నగరంలోనే ఉండడం గమనార్హం.
- కడప నగర శివారులోని మూలవంక వద్ద ఓ వైకాపా నాయకుడు 52 ఎకరాల ప్రభుత్వ భూమికి అక్రమంగా ఎన్ఓసీ తెప్పించుకుని వెంచర్లు వేసినట్లు నివేదికలో పొందుపర్చారు. కడప నగరపాలక సంస్థలో ఓ వైకాపా కీలక నాయకుడు రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. కడప నగరంలోని రాజారెడ్డి వీధిలోని పోలీసు సంక్షేమం కోసం కేటాయించిన స్థలాన్ని అక్రమంగా లీజుకు తీసుకుని హోటల్ నిర్మాణాలు చేపట్టడం అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. నలుగురు వైకాపా నాయకుల భూపంపకాల్లో వచ్చిన తేడాలతో ఏడాది కిందట వైకాపా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డిని పట్ట పగలు దారుణంగా హత్య చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.



దేవుని కడప చెరువు భూమిలో వేసిన వెంచర్

- దేవుని కడప చెరువును 60 ఎకరాల వరకు ఆక్రమించి అతి పెద్ద వెంచర్లు వేసినట్లు నివేదికలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఇందులో ఓ వైకాపా కీలక నేత పేరును ప్రస్తావించారు. ఇందులోనే రూ.300 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి అతి పెద్ద చెరువును ఆక్రమించినట్లు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ట్యాంక్ బండ్ చేస్తామంటూ శంకుస్థాపన చేసినా ఆక్రమణల కారణంగా పనులు చేపట్టకుండా అడ్డుకున్నట్లుగా నివేదికలో పేర్కొన్నారు.

సర్కారు బడి... ఇరుకున పడి!



నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలోని ఓ తరగతి గదిలో పరదాలు అడ్డుగా ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్న రెండు తరగతులు

చాపాడు మండలం నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులుండగా, ఏడు తరగతుల విద్యార్థులను మూడు గదుల్లో ఇరుకుగా కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్న గదుల్లోనే రెండు తరగతుల చొప్పున విద్యార్థులను కూర్చోబెట్టి పరదాలను తెరగా ఏర్పాటు చేసుకుని ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. చెంచుపల్లెలో పురాతన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి పడితే పెద్ద ప్రమాదం జరుగుతుందని పక్కనే ఉన్న వంట గదిలో తరగతుల నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో రవిశంకర్ మాట్లాడుతూ రెండు పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభమవుతాయని వివరించారు. **-న్యూస్‌టుడే, చాపాడు**



చెంచుపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలోని వంట గదిలో నిర్వహిస్తున్న తరగతులు

జిల్లా విద్యాశాఖాధికారిగా మీనాక్షి



కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా మీనాక్షి నియమితులయ్యారు. ఆమెను ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖాధికారిగా రెగ్యులర్ ప్రాతిపదికన, అదనపు బాధ్యతలతో డీఈవోగా నియమిస్తున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖాధికారిగా ఉన్న అనురాధను రాష్ట్ర కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. మీనాక్షి ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారిగా, ధర్మవరం ఉప విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 1987లో కర్నూలు డీఈవో కార్యాలయంలో టైపిస్ట్‌గా చేరి, వివిధ పదోన్నతులు పొంది, 2022 జూన్ నుంచి శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్నారు.

ఆ డీఈవో మాకొద్దు!

- అధికార పార్టీ నేతల నుంచి అభ్యంతరాలు
- వరలక్ష్మిని నియమించాలంటూ ప్రతిపాదన

ఈనాడు, కడప: వైకాపాతో అంటకాగడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై బదిలీ వేటు పడింది. ఇదే సమయంలో డీఈవోగా యు.మీనాక్షి నియామకంపై అధికార పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి నివేదించారు. ఆమె ప్రజాప్రతినిధుల ఫోన్లకు సమాధానమివ్వరని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే విమర్శల తరుణంలో నేతలు స్పందించారు. మీనాక్షి స్థానంలో అనంతపురం డీఈవో బి.వరలక్ష్మిని నియమించాలని పట్టుబడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సొంత జిల్లా చిత్తూరుకు ప్రత్యేకంగా వరలక్ష్మిని నియమించారు. ఈమెను జిల్లాకు నియమించాలంటూ పలువురు నేతలు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. కడప డీఈవో అనూరాధకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆమెను బదిలీ చేయాలంటూ నేతలు కోరగా ఆ మేరకు బదిలీ జరిగింది.

పాఠశాలలకు నిధులు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మండల విద్యావనరుల కేంద్రాలు, పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాల వారీగా నిధుల కేటాయింపు వివరాలను తెలియజేస్తూ ఏపీ సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ రాష్ట్ర డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గత వైకాపా ప్రభుత్వం 2023లో కేవలం 40 శాతం మాత్రమే నిధులిచ్చి పాఠశాలలను కష్టాల్లోకి నెట్టేసింది. ఎన్నికల ఏడాదైన 2024లో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు సొంత నిధులు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం సుద్దముక్కలు కొనుగోలు చేసేందుకు డబ్బుల్లేక ఇబ్బందులు పడ్డారు. సమస్యలను ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి పలు సంఘాలు తీసుకెళ్లాయి. దీనిపై స్పందించిన మంత్రి అన్ని జిల్లాలకు నిధులు కేటాయిస్తూ ఈనెల 21వ తేదీన ఉత్తర్వులిచ్చారు. పాఠశాలల నిర్వహణకు, ఎంఈవో కార్యాలయాలకు నిధులు మంజూరు కాగా, రెండు, మూడు రోజుల్లో ప్రధానోపాధ్యాయుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ కానున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి నిధులు ఖర్చు చేయాల్సి ఉందని ఉత్తర్వుల ప్రతిలో పేర్కొన్నారు. జిల్లాలో 36 ఎంఈవో కార్యాలయాలుండగా, ఒక్కొక్క కార్యాలయానికి రూ.1.30 లక్షలు కేటాయించారు. టీఎల్ఎంకు రూ.30 వేలు, నిర్వహణకు రూ.30 వేలు, కంటెన్‌జెన్సీకి రూ.40 వేలు, సమావేశాలకు రూ.30 వేలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని 1,936 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.4.31 కోట్లు కేటాయించగా, తొలి విడత కింద 50 శాతం నిధులు రూ.2.15 కోట్లు విడుదల చేశారు.



ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ విరాట్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఆడుకుంటున్న విద్యార్థులు



ఖజానాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

సీపీఎస్ ఉద్యోగులకు డీఏలు చెల్లించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: డీఏ బిల్లులు మంజూరై మూడేళ్లయినా ఇంతవరకు సీపీఎస్ ఉద్యోగులకు నగదు చెల్లించలేదని, వెంటనే ఇవ్వాలని ఖజానా శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ చంద్రమౌళిసింగ్‌కు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి వినతి పత్రం అందించారు. కడపకు వచ్చిన ఆయనకు ఎస్టీయూ నేతలు కలిశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన రెండు డీఏలకు సంబంధించి జిల్లాలోని 30శాతం మందికి ఇంకా జమకాలేదన్నారు. విధానాలను సరళీకృతం చేయాలని సూచించారు. సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, నాయకులు జయరామయ్య, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములపై విచారణ

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాజంపేట: రాజంపేట మండలం మన్నూరు, తాళ్లపాక రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ పేరిట సాగిన భూదందాపై సమగ్ర విచారణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియాదేవి రాజంపేట తహసీల్దారు కార్యాలయంలో గురువారం దస్త్రాలను పరిశీలించారు. 'ఈనాడు' ప్రధాన సంచికలో ఈ నెల 21న 'పంచేశారు.. భోంచేశారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు దృష్టి సారించడంతోపాటు వివిధ రూపాల్లో ఫిర్యాదులందడంతో విచారణకు ఉపక్రమించారు.

వెబ్‌సైట్‌లో తుది మెరిట్ జాబితా

కడప విద్య : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు ఎంపికైన మహిళా అభ్యర్థుల తుది జాబితాను www.kadapadeo.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ ప్రకటనలో పేర్కొన్నారు. డీఈవో కార్యాలయం, జిల్లా సమగ్రశిక్ష కార్యాలయాల నోటీసుబోర్డుల్లోనూ అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు సరిచూసుకోవాలని సూచించారు.

- పులివెందులలో బుధవారం ఆర్టీసీ అద్దె బస్సు అదుపు తప్పి లోయలో బోల్తా పడిన ఘటనలో 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.
- కడప కడప శివారులోని పాత టోల్‌గేటు వద్ద గతంలో కడప డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు స్కూటీని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఒకరికి తీవ్రగాయాలయ్యాయి.
- కడప నగర శివారులోని గురుకుల పాఠశాల వద్ద జూన్ 17న కడప డిపోకు చెందిన బస్సు కారును ఢీకొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.
- జిల్లాలో 2024, జనవరి నుంచి 2024 అక్టోబరు 23వ తేదీ వరకు 9 ఆర్టీసీ అద్దె బస్సుల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఘటనల్లో 8 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

అద్దె బస్సు... భద్రత తుస్సు!

చోదకుల అతివేగం, నిర్లక్ష్యంతో నిత్యం ప్రమాదాలు ● ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లేమితోనే ఘటనలు

-న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

జిల్లాలో ఆర్టీసీ అద్దె బస్సుల్లో ప్రయాణం దినదినగండంగా మారింది. కొంతమంది చోదకులు నిర్లక్ష్యంతో నడపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల, బద్వేలు డిపోల్లో కలిపి 220 ఆర్టీసీ అద్దె బస్సులున్నాయి. వీటిలో చాలావరకు పల్లె వెలుగు సర్వీసులే. రోజుకు ఎన్ని కిలోమీటర్లు తిప్పితే అన్ని డబ్బులిస్తారు. ఆర్టీసీ యాజమాన్యం కూడా అద్దె బస్సులతో నాలుగు డబ్బులు మిగులుతాయనే ఆలోచన తప్ప ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడంలేదు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఆర్టీసీ సొంతంగా ఒక్క బస్సు కూడా కొనుగోలు చేయలేదు. ఎక్కడా లేని విధంగా జిల్లాలోనే అత్యధికంగా అద్దె బస్సులున్నాయి.



ఇటీవల పులివెందుల ప్రాంతంలో లోయలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ అద్దె బస్సు

బాధ్యత ఏది...?

చాలా మంది అద్దె బస్సు చోదకులకు హెవీ డ్రైవింగ్ లైసెన్సులు లేవు. ఉన్నా గడువు తీరిపోయినవే. ఒక వేళ రోజూ వెళ్లే చోదకుడు రాకుంటే యజమానులు అందుబాటులో ఎవరుంటే అతడిని తీసుకొచ్చి బస్సు ఇచ్చి పంపుతారు. అతను అనుభవం ఉందా, లైసెన్సు ఉందా అనేవి పరిశీలించకుండానే పంపిస్తారు. గతంలో ఆర్టీసీ స్క్వాడ్ సిబ్బంది అద్దె బస్సులను ఆపి చోదకుడి లైసెన్సు తదితర వాటిని తనిఖీ చేసేవారు. ఇటీవల కాలంలో తనిఖీలు చేయడం లేదు. పైగా అద్దె బస్సు చోదకులకు బాధ్యత ఉండదు. దీంతో వారు ఇష్టానుసారంగా, మితిమీరిన వేగంతో బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం

ఆర్టీసీ బస్సు చోదకులతోపాటు అద్దె బస్సుల చోదకులకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్యాలయంలో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. నిర్లక్ష్యంగా బస్సులు నడిపిన వారిని విధుల్లోకి తీసుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం. **- గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, కడప**

తప్పులుంటే చెప్పండి... రీసర్వేలో సవరిస్తాం


రైతులతో మాట్లాడుతున్న బాధ్య కలెక్టర్ అదితిసింగ్, ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో జరిగిన తప్పుల సవరణకు బ్రహ్మంగారిమఠం ముడుమాల గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి అర్జీలను తహసీల్దారు దామోదర్‌రెడ్డి స్వీకరించారు. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామని, రీసర్వే నిర్వహించిన మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మల్లేపల్లెలో జాతీయరహదారిలో భూములు కోల్పోతున్న రైతులతో ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నారాయణయాదవ్, రైతులు పాల్గొన్నారు.

దాడి చేసింది వారు కాదు

- పోలీసులు చెప్పింది అవాస్తవం
- తెదేపా నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: తనపై దాడికి సంబంధించి పోలీసులు అరెస్టు చేసిన వారు అసలు నిందితులు కాదని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి పేర్కొన్నారు. దీనిపై గురువారం ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. పోలీసులు, అదృశ్య శక్తులు ముందస్తు ప్రణాళిక ప్రకారం కొందరిని అరెస్టు చేసి, జామీనుదారులతో సహా వచ్చి బెయిలు తీసుకున్నారని ఆరోపించారు. చిన్నచితకా కేసులకు మీడియాను పిలిచి పూర్వాపరాలు వివరించే పోలీసులు, తన కేసుకు సంబంధించి వారికి ఎందుకు సమాచారం ఇవ్వలేదని శివకొండారెడ్డి ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్‌కు, తనకు సంబంధం లేదని, దాడికి పాల్పడిన వ్యక్తులు లక్కిరెడ్డిపల్లె వాసులని పేర్కొన్నారు. పోలీసుల చెప్పిందంతా అవాస్తమని స్పష్టం చేశారు. ఈ ఘటనను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరతానని స్పష్టంచేశారు. ఎస్పీని కూడా స్వయంగా కలిసి పూర్తి వివరాలు తెలుపుతానని చెప్పారు.

రైతులకు యాంత్రీకరణ భాగ్యం!

- రాయితీపై పరికరాలివ్వాలని నిర్ణయం
- వ్యవసాయశాఖాధికారుల ప్రతిపాదన
- ఎన్డీయే సర్కారుపై చిగురించిన ఆశలు

- న్యూస్‌టుడే, కడప

వ్యవసాయ రంగంలో కూలీల కొరత వెంటాడుతోంది. యంత్ర పరికరాల వినియోగం అనివార్యమైంది. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో మద్దతుదారులకు పెద్దపీట వేశారు. నచ్చినోళ్లకే యంత్ర పరికరాలు మంజూరు చేశారు. సన్న, చిన్నకారు రైతులకు అరచేతిలో వైకుంఠం చూపారు. కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా నిర్వేదమే మిగిలింది. కర్షకుల కన్నీటి వెతలను జగన్‌రెడ్డి జమానాలో ఎవరూ ఆలకించలేదు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలకు వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలివ్వాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఏఏ రకాలు కావాలో సమాచారం సేకరించి నివేదించాలని ఇటీవల ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

◆ జిల్లాలో రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆర్థిక సంవత్సరంలో 18 రకాల 15,835 యంత్ర పరికరాలు రాయితీపై ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటిని ఉమ్మడి సంఘాలు, బృంద సభ్యులు, వ్యక్తిగతంగా మంజూరు చేయాలని కసరత్తు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతుల కన్నీటి ఘోషను చెవికెక్కించుకోలేదు. కర్షకులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదు. నేలలో లోతు దుక్కులు, విత్తనం, ఎరువులు చల్లడానికి అనువైన గొర్రులు, శరవేగంగా సేద్యం పనులు చేయడానికి కావాల్సిన ట్రాక్టర్లు మంజూరు చేయాలని వేడుకున్నా ఉలుకుపలుకు లేదు. తొలి రెండేళ్లు రిక్తహస్తం చూపారు. చివర్లో రైతు భరోసా కేంద్రాల్లో యంత్రపరికరాలను అందుబాటులో పెట్టి తక్కువ ధరలకే ఇవ్వాలని వినియోగదారుల అద్దె కేంద్రాలను ఏర్పాటు చేయించారు. రైతు వినియోగదారుల సంఘాల పేరిట వైకాపా విధేయులకు పందేరం చేశారు. సాధారణ రైతులకు మాత్రం నిరాశ తప్పలేదు.

జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనలు	
రకం	యంత్ర పరికరాలు
గ్రాసం కత్తిరింపులు	25
మొక్కజొన్న నూర్పిడి	30
వరి నూర్పిడి	30
పవర్ వీడర్లు	100
గడ్డి కట్టలు కట్టడానికి	100
లోతు దుక్కుల మడకలు	200
చిన్న ట్రాక్టర్లు	200
పంటలనూర్పిడి యంత్రాలు	300
ట్రాక్టర్ల ట్రాలీలు	300
ట్రాక్టర్ల స్ప్రేయర్లు	300
హైస్పీడ్ స్ప్రేయర్లు	500
డీజిల్ ఇంజిన్లు	500
ఎరువులు చల్లే గొర్రు	500
7 మడకల గొర్రులు	550
9 మడకల గొర్రులు	600
ట్రాక్టర్లు	600
రోటావేటర్లు	1,000
టార్పాలిన్ పట్టలు	10,000

◆ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో మునుపటిలా రైతులకు యంత్ర భాగ్యం కల్పించాలని ముందుకొచ్చారు. ప్రాధాన్య క్రమంలో ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు అందజేయాలని ఉన్నత స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. భూమిలో విత్తనం వేసిన అనంతరం చిరు మొలక నుంచి కోత వరకు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పురుగులు దాడి చేస్తున్నాయి. అన్నదాతల ఆశల పంటను నమిలి మింగేస్తున్నాయి. చీడల అదుపు చేయడంలో కీలకమైన చేతి, కాలితో తొక్కేవి, తైవాన్, పవర్, ట్రాక్టర్లను వాడే స్ప్రేయర్లను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది.


బహుళ పంటల నూర్పిడి యంత్రాలు

◆ పంట సాగు చేసిన తర్వాత ఆరుగాలం శ్రమించి, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటే దిగుబడులు చేతికందే సమయంలో ప్రకృతి విపత్తులు విజృంభిస్తున్నాయి. వర్షానికి తడవకుండా టార్పాలిన్ పట్టలు ఇవ్వాలని సాగుదారులు అడిగినా (2019-24) మధ్య కాలంలో అధికారంలో ఉన్న జగన్‌రెడ్డి అసలు పట్టించుకోలేదు. ఈసారి మాత్రం పెద్దఎత్తున ఇవ్వాలని ముందుకొచ్చారు. క్షేత్రస్థాయిలో అమలు కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. త్వరలో ఉన్నత స్థాయి నుంచి మార్గదర్శకాలు రాగానే మంజూరు చేయాలని నిర్ణయించారు.

◆ వరి కోత, బహుళ పంటల నూర్పిడి యంత్రాలు, చిన్న ట్రాక్టర్లు, గడ్డి కట్టలు కట్టడానికి, గ్రాసం కత్తిరింపులు, డీజిల్ ఇంజిన్లు, ట్రాలీలు, రోటావేటర్లు, ఇలా ఇతరత్రా పరికరాలు రాయితీపై ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. త్వరలో అనుమతి రానున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

అనుమతి రాగానే మంజూరు చేస్తాం

జిల్లాలో వ్యవసాయం చేస్తున్న రైతులకు కావాల్సిన 18 రకాల యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతి రాగానే ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన కర్షకులకు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- ఎ.నాగేశ్వరరావు, డీఏవో

ఎర్రచందనం స్వాధీనం... ముగ్గురి అరెస్టు


నిందితులు, దుంగలతో కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్, అధికారులు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం రేంజిలోని గొల్లపల్లె బీటు అటవీ ప్రాంతంలో గురువారం అటవీ అధికారులు రూ.లక్షకు పైగా విలువ చేసే 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు కూలీలను అరెస్టు చేశారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గొల్లపల్లె బీటులోని సాలుపెంట అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. చాపాడు మండలానికి చెందిన హరీబాబు, తమిళనాడుకు చెందిన గోపి, శీర్గాని రవికి కూలీలు పట్టుబడగా, చాపాడుకు చెందిన జాకీర్ పరారయ్యారని చెప్పారు. అక్కడ లభ్యమైన 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సబ్ డీఎఫ్‌వో స్వామివివేకానంద, సిద్దవటం అటవీక్షేత్రాధికారి కళావతి, ఉప అటవీక్షేత్రాధికారి ఓబులేసు, బీటు అధికారులు, విశ్వనాథ్‌రెడ్డి, పెంచలరెడ్డి, సహాయ బీటు అధికారి హైమావతి, బేస్‌క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్ర చందనం కేసులో ఐదేళ్ల జైలు...

తిరుపతి (లీగల్): ఎర్రచందనం రవాణాలో ప్రత్యేక జిల్లా సెషన్సు కోర్టులో నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ ప్రత్యేక అదనపు జిల్లా సెషన్సు జడ్జి ఎ.నరసింహమూర్తి గురువారం తీర్పు వెలువరించినట్లు కోర్టు ప్రత్యేక ఏపీపీ కె.నగేష్, కోర్టు లైజన్ అధికారులు జె.చంద్రశేఖర్‌రాజు, హరినాథరాజు తెలిపారు. ఎర్రగుంట్లకు చెందిన మంగలిపుట్టం వరప్రసాదు 2019 డిసెంబరు 8న ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలో 60 కేజీల ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పులివెందుల,(వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందుల పురపాలక పరిధిలోని వెంకటాపురంలో గురువారం విద్యుదాఘాతంతో బింగి వెంకటనారాయణ (59) అనే రైతు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటనారాయణ తనకున్న రెండెకరాల్లో అరటి సాగు చేశారు. అరటి చెట్లకు డ్రిప్ ద్వారా మందులు ఎక్కించేందుకు గురువారం మోటారు స్టార్టర్ నొక్కగానే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష కోసం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన మరుసటి రోజే పింఛను


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళిసింగ్, ఆడిటర్ జనరల్ లలిత్‌కుమార్, ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఉద్యోగులు పదవీవిరమణ పొందిన మరుసటి రోజే పింఛను మంజూరు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళిసింగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఉద్యోగుల జీపీఎఫ్, పింఛను సమస్యలపై అదాలత్ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సందేహాల నివృత్తికి పింఛను అదాలత్ నిర్వహిస్తున్నామని వివరించారు. దీనికి ఆరు నెలల ముందే అన్ని పత్రాలను పంపించాలన్నారు. ఉద్యోగులు పదవీవిరమణ పొందే సమయానికి సర్వీసు రిజిస్టర్‌లో అన్ని ఎంట్రీస్ పక్కాగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. జీపీఎఫ్, పింఛను సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన పలువురికి పింఛను పేమెంట్‌పత్రాలు, మరో 30 మంది ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను ఆడిటర్ జనరల్ లలిత్‌కుమార్, ఖజానాశాఖ డైరెక్టర్ మోహన్‌రావులతో కలిసి అందజేశారు. సీనియర్ ఏవోలు సునీత, చంద్రశేఖర్, భవానీ ప్రసాద్, విజయ్‌కుమార్, కడప డీడీ వెంకటేశ్వర్లు, ఉప ఖజానా అధికారులు పాల్గొన్నారు.


వైవీయూ సీఈగా కృష్ణారావు



వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి (సీఈ)గా రసాయనశాస్త్ర శాఖ ఆచార్యులు కేఎస్వీ కృష్ణారావు నియమితులయ్యారు. వీసీ కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పి.పద్మలు గురువారం ఆయనకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఇప్పటివరకు సీఈగా ఉన్న ఎన్.ఈశ్వర్‌రెడ్డి పదవీకాలం పూర్తికావడంతో బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు.

సీడీసీ అసోసియేట్ డీన్‌గా గంగయ్య: యోగి వేమన విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.గంగయ్యను కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) అసోసియేట్ డీన్‌గా నియమించారు. ఆయనకు గురువారం వీసీ కృష్ణారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. సీడీసీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ సభ్యుడిగా చంద్రశేఖర్



వైవీయూ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోని పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ సభ్యుడిగా యోగి వేమన విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ టి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ అదనపు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. పరిశ్రమలకు పర్యావరణ పరమైన అనుమతులు ఈ కమిటీ మంజూరు చేస్తోంది. చంద్రశేఖర్‌కు పర్యావరణ పరిశోధనలో విశేష అనుభవం ఉంది.

ఉపాధి అవకాశాలపై అవగాహన

ఎన్జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్టెప్ శాఖపై ఉందని, వివిధ సంఘాలు, ప్రైవేటు సంస్థల సహకారంతో కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి పేర్కొన్నారు. ఆమె గురువారం ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశం ఏర్పాటుచేసి శాఖలో జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధిపై ఆ శాఖ సీఈవో, మేనేజరుతో కలిసి చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ గతంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మళ్లీ శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్టెప్ సీఈవో సి.సాయిగ్రేస్, కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, స్టెప్ సీఈవో సుబ్బరాయుడు, సిబ్బంది అబ్బాస్, నాగయ్య, నారాయణ పాల్గొన్నారు.

జాతీయ ఉర్దూ సదస్సు ఛైర్మన్‌గా సత్తార్‌ఫైజీ

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: అంజుమన్ తరక్కీ ఉర్దూ ఆధ్వర్యంలో నవంబర్ 9వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, ఛైర్మన్‌గా ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు సత్తార్ ఫైజీని ఎంపిక చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి హిదయతుల్లా పేర్కొన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ ఉర్దూ సాహితీవేత్తలు, కవులు, రచయితలు, విమర్శకులు హాజరవుతారన్నారు. జిల్లాలోని ఉర్దూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహిళా సమస్యలపై పోరాడిన బషీరున్నీసా


బషీరున్నిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: బషీరున్నిసా మహిళల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య కొనియాడారు. ఇటీవల మృతిచెందిన సీపీఐ కార్యవర్గ సభ్యురాలు బషీరున్నిసా సంస్మరణసభ గురువారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలు బషీరున్నీసా పార్టీ కోసం అంకితభావంతో పని చేశారని తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగించాలని సూచించారు. వివిధ పార్టీల నాయకులు విజయజ్యోతి, దుర్గాభవాని, చంద్రశేఖర్, గాలి చంద్ర, లక్ష్మీరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, గుర్రప్ప, మల్లికార్జున, మనోహర్, మహేష్, రమణయ్య, బాదుల్లా, వెంకటశివ, మద్దిలేటి తదితరులున్నారు.

ఆధునిక పద్ధతులతో పశు, పాడి రంగాలు బలోపేతం


శాస్త్రవేత్తకు జ్ఞాపికను బహూకరిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాదు, పక్కన హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆధునిక శాస్త్రీయ పద్ధతులు, సేవలను సమన్వయం చేసుకుని పశు, పాడి అనుబంధమైన జీవోపాధులను బలోపేతం చేయాలని ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస ప్రసాదు తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో జాతీయ పశువైద్య సదస్సు రెండో రోజు సందర్భంగా దేశ, విదేశాల్లో శాస్త్రీయ పరిశోధన పత్రాలకు సంబంధించి వివరాలను వెల్లడించారు. వ్యవసాయంలో పశుయాజమాన్యాలు, పాడి పోషణలో ఆధునికీకరణ, అధిక పాలు, మాంసం, గుడ్ల ఉత్పాదకాలకు బయోటెక్నాలజీ ఎంతో కీలకంగా ఉపయోగపడుతోందని శాస్త్రవేత్తలు విశదీకరించారు. సరికొత్త సాంకేతిక విలువలు, సేవలను ఉపయుక్తంగా అన్వయం చేసుకుంటే సుస్థిర జీనవోపాధులకు గణనీయంగా ప్రగతి, అభివృద్ధి ఉంటుందన్నారు. పరిశోధన పత్రాలను సమర్పించిన శాస్త్రవేత్తలకు జ్ఞాపికలతోపాటు ప్రశంస పత్రాలను అసోసియేట్ డీన్ అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ రాజ కిశోర్, హెచ్‌వోడీలు ఇందిర, నాగమల్లిక, త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.


‘డబ్బు, అధికారమే జగన్‌కు పరమావధి’

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మ, చెల్లి, ప్రజలు ఎవరూ అవసరం లేదని కేవలం డబ్బు, అధికారమే పరమావధని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారంలో జగన్ వైఖరి మరోసారి బయట పడిందని వ్యాఖ్యానించారు. కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీకి దేశంలో ఎవరికీ రాని మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను స్వాగతిస్తున్నామని, అయితే ఏడాదికి ఇంటింటికీ ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన హామీని యథాతథంగా అమలు చేయాలని, అందరికీ పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా చెప్పాలన్నారు. తల్లికి వందనం నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్‌గా ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి మాట్లాడుతూ ప్రధాని సొంత రాష్ట్రంలోనే ఓ వ్యక్తి నకిలీ కోర్టు నిర్వహించడం దారుణమని, దేశంలో పాలన ఏ మేరకు సాగుతోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. పార్టీ నాయకులు ప్రసాద్‌గౌడ్, కులాయప్ప, సిరాజుద్దీన్, సత్తార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: పశుగణన.. కేవలం పశువుల సంఖ్యను తెలుసుకోవడానికే కాకుండా దేశ భవిష్యత్తుకు ఉపయోగపడేలా ప్రతి ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా చేపడతారు. పశు సంతతి సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆ రంగానికి ఏం అవసరమో తెలుసుకుని, కావాల్సిన వనరులను పక్కాగా అమలు చేయడానికి ఇది దోహద పడుతుంది. ఈ పశుగణన కార్యక్రమం ఈ నెల 25 నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ఇది నాలుగు నెలలకు పైగా కొనసాగి ఫిబ్రవరి ఆఖరుకు ముగుస్తుంది. ఇంటింటికి స్టిక్కర్లు అతికించే స్టిక్కర్లు పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి చేరాయి. గణనకు సంబంధించి జిల్లాకు శ్రీనివాసరాజును సమన్వయకర్తగా నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లను నియమించి, శిక్షణ ఇచ్చారు. పశువుల సంఖ్య, వయస్సు, రకాలు, లింగ వివరాలు, పాల ఉత్పత్తి, ఆరోగ్యం, మేత పద్ధతి, పశువుల పాకలు, తదితర వివరాలను పరిశీలించి అంతర్జాలంలో నమోదు చేస్తారు. గణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులు సహకరించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి శారద పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధించిన గోడపత్రాలను బాధ్య కలెక్టర్ అదితిసింగ్ ఆవిష్కరించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, నోడల్ అధికారి ప్రమోద్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి అనుపమ, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, డీపీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీబీఆర్‌లోకి భారీగా వరద



పెంచికల బసిరెడ్డి జలాశయంలోకి భారీగా వరద చేరుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు 2164 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. అనంతపురం జిల్లా పరిధిలో చెరువులు నిండటంతో గురువారం 2164 క్యూసెక్కుల మేర వరదనీరు జలాశయంలోకి చేరింది. ప్రస్తుతం జలాశయంలో 8.2 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. 9 టీఎంసీలకు చేరగానే గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తామని, చిత్రావతి పరీవాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని పీబీసీ ఈఈ రాజశేఖర్ తెలిపారు. **- న్యూస్‌టుడే, లింగాల**

గురుకుల బాలికలు.. క్రీడల్లో మెరికలు

తొండూరు, న్యూస్‌టుడే : గ్రామీణ బాలికలు క్రీడల్లో సత్తా చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు తొండూరు మండలంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. అవకాశాలను చక్కగా అందిపుచ్చుకుని క్రీడల్లో రాటుదేలుతున్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదుగుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. విద్యార్థులు మణికర్ణిక, కీర్తన, జయ సుమశ్రీ గతేడాది జాతీయ స్థాయి గట్కా పోటీల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతా



నా సొంతూరు ప్రొద్దుటూరు. పేద కుటుంబం నుంచి వచ్చాను. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఎంతో ఆసక్తి. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో గట్కా పోటీల్లో మెలకువలు నేర్చుకుంటున్నాను. ఇప్పటికే జాతీయ స్థాయిలో సత్తా చాటి పతకం సాధించాను. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకొచ్చేందుకు మరింత శ్రమిస్తున్నాను. **- మణికర్ణిక**

దేశానికి పతకాలు తీసుకొస్తా



మా సొంతూరు వేంపల్లె. గట్కా పోటీల్లో మెలకువలు నేర్చుకుంటున్నాను. క్రీడల్లో గెలుపోటములు సహజం. ఓటమి చెందినప్పుడు కుంగిపోకుండా గెలుపు బాట పట్టేందుకు శ్రమిస్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడమే లక్ష్యం. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి దేశానికి పతకాలు తీసుకొస్తాను. **- కీర్తన**

క్రీడాకోటాలో ఉద్యోగం సాధిస్తా



మాది ప్రొద్దుటూరు. చదువుతో పాటి క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలనేది నా ఆకాంక్ష. చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తాను. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించేందుకు కృషి చేస్తున్నాను. **- జయ సుమశ్రీ**

షూటింగ్‌బాల్‌లో ప్రతిభ



మాది ఎర్రగుంట్ల మండలంలోని కదిరివారిపల్లె. షూటింగ్ బాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక య్యాను. మరింత కృషి, పట్టుదలతో శిక్షణ తీసుకుని అంతర్జాతీయ పోటీలల్లో తలపడాలనేదే నా కోరిక. ఒకవైపు చదువు, మరోవైపు క్రీడల్లో రాణిస్తున్నాను **- హరిత సెల్వి**

డిసెంబరు 8న భగవద్గీత పోటీలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: గీతా జయంతిని పురస్కరించుకుని తితిదే, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 8న ఉమ్మడి కడప జిల్లా విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ, ధ్యాన యోగం పోటీలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ సహాయకులు గోపీబాబు, రాంమహేష్ తెలిపారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో గురువారం వారు మాట్లాడుతూ విభాగాల వారీగా పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కోదండరామస్వామి ఆలయంలో పోటీలు జరుగుతాయని, పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విజయభట్టార్, దామోదరమ్మ, వెంకటరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు

మారుతీనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, వలరాజు అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ బకాయిలు అందకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

అట్లూరు కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

అట్లూరు, న్యూస్‌టుడే : జిల్లా చెన్నైలో రాష్ట్రస్థాయిలో అండర్-19 జూనియర్ సౌత్ జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్లో అట్లూరు కస్తూర్బా చెందిన 8 మంది విద్యార్థినులు సత్తాచాటారు. వీరు పాల్గొన్న జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. చెన్నైలో క్రీడా పోటీలు ముగించుకొని గురువారం కస్తూర్బాకు చేరుకున్న విద్యార్థినులను ప్రిన్సిపల్ పణిశ్రీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్ పణిశ్రీ

పాఠశాలకు మరమ్మతులు చేయిస్తాం


పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక నడింపల్లి పురపాలక ఉన్నత పాఠశాలకు మరమ్మతులు చేయిస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి అన్నారు. గురువారం ఆ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు తదితర విషయాలు తెలుసుకున్నారు. విద్య ఉన్నత స్థానానికి చేరుస్తుందని చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకు రావాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక కౌన్సిలర్ హరితారెడ్డి, మాజీ కౌన్సిలర్ చింతకుంట జయలింగారెడ్డి, తెదేపా నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966343431
జమ్మలమడుగు: 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

స్పందనకు వందనం

✦ **కొండాపురం:** బైపాస్ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు గ్రావెల్ రోడ్డుకు మరమ్మతులను కూటమి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈనెల 11వ తేదీ ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ప్రజలు, రోగులకు ఇబ్బంది లేకుండా ఆసుపత్రి దారిలో ఉన్న కంపచెట్లను తొలగింపజేసి, గుంతలను మట్టితో పూడ్చి వేయించి, సమస్యను పరిష్కరించారు.

✦ **ప్రొద్దుటూరు పట్టణం:** నాగేంద్రనగర్‌లో గడ్డికయ్యల వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న చెత్తదిబ్బలను సోమేలవారిపల్లె పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి కార్మికులతో చెత్త తీయించారు. చెత్త తొలగించకపోవడంతో పాదచారులు పడుతున్న ఇబ్బందులపై ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి సమస్య పరిష్కరించారు.

✦ **ప్రొద్దుటూరు పట్టణం:** రాజీవ్‌సర్కిల్ సమీపంలో ఉన్న మురుగు కాలువల్లో పూడికను 4వ సచివాలయ వార్డు పారిశుద్ధ్య కార్యదర్శి శివరంజని యంత్రం సహాయంతో పూడికను తొలగించారు. ఈ కాలువలో పూడిక సక్రమంగా తొలగించలేదని ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించి పనులు చేయించారు.

✦ **ఖాజీపేట:** తహసీల్దారు కార్యాలయం సమీపంలోని శ్రీనివాసనగర్ వద్ద రహదారిపై తాగునీటి పైపులైను లీకేజీపై ప్రచురితమైన అంశానికి ఎంపీడీవో దివిజ స్పందించారు. పంచాయతీ సిబ్బందితో లీకేజీకి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

ముద్దనూరు... సమస్యలతో బేజారు!

–న్యూస్‌టుడే, ముద్దనూరు

మండల కేంద్రం ముద్దనూరులోని ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. పాత బస్టాండ్, కొత్తకోటాల కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు, వర్షాకాలం వస్తే చాలు రోడ్లపై నీరు నిలవడం, తదితర మౌలిక వసతులు లోపిస్తున్నాయి. కొన్ని కాలనీల్లో పారుదలకు అనుగుణంగా కాలువ ల్లేక ఇళ్ల ముందు డ్రైనేజీ గుంతలు తవ్వుకొన్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలుస్తున్నాయి. పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న కొత్తకోటాల కాలనీలో వానాకాలం వస్తే చాలు కాలనీ అంతటా చెత్తాచెదారం పేరుకుపోవడం, సీసీ రోడ్లు గుంతలుపడటంతో రోడ్లపై ఉన్న వర్షపు నీరు పాచికడుతోంది. దుర్వాసన కారణంగా మురుగు రోడ్లపై పారడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. పాతబస్టాండ్‌లో రోడ్డుకు గుంతలు పడటంతో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నీరు రోజులకొద్దీ నిలవడం వల్ల ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు, బస్టాండ్‌లోని దుకాణాదారులు ఆవేదన చెందుతున్నారు.


ఇరుకుగా కొత్తకోటాలవీధిలో...


పాత బస్టాండు రోడ్డులో రాకపోకలెలా..?

మరుగుదొడ్లకు తలుపులేవీ?

పాత బస్టాండ్ ఆవరణంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అయితే వాటికి తలుపుల్లేకపోవడంతో తాత్కాలికంగా పరదా ఏర్పాటు చేశారు. పరిశుభ్రత పాటించలేకపోవడంతో అందరూ అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడి నుంచి కొత్త బస్టాండ్‌కు వెళ్లాలంటే కొత్తకోటాల కాలనీలోని ఇరుకుగా ఉన్న రోడ్డులో వెళుతున్నాయి. అయితే ఈ కాలనీ రోడ్డు ఇరుకుగా ఉన్నందున బస్సు వచ్చే సమయంలో ఎదురుగా బైకులు, ఇతర వాహనాలు రాలేవని ఈ రోడ్డుకు 20 వేల గృహాలు ఉన్నందున పిల్లలు ఇంటిలో నుంచి బయటకు రావాలన్నా రాలేకపోతున్నారు. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయన్నారు.

కాలువల్లేక ఇళ్ల ముందు గుంతల ఏర్పాటు



కొత్తకోటాల కాలనీలో మురుగు కాలువలు ఏర్పాటు చేయలని మురుగు పారేందుకు మార్గం లేక ఇళ్ల ముందు గుంతలు తవ్వుకున్నాం. సీసీరోడ్లకు గుంతలు పడటంతో వర్షపు నీరంతా గుంతల్లోనే నిలిచి దుర్వాసన వస్తోంది. కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్సులు పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వెళ్లాలంటే పోలీస్ స్టేషన్ ఎదురుగా కొత్తకోటాల వీధిలోని ఇరుకైన సందుల్లో వెళుతున్నాయి. బస్సు వచ్చే సమయంలో ఎదురుగా బైకులు కూడా రాలేవు. **-శ్రీకాంత్‌బాబు, స్థానికుడు**

పరిశీలించి అన్నింటినీ పరిష్కరిస్తాం

జననివాస కాలనీల్లోని మురుగు నీటిని, తొలగించి చెత్తాచెదారాలను శుభ్రం చేయిస్తాం. అన్ని కాలనీలను పరిశీలించి బస్టాండ్‌లోని మరుగుదొడ్లను శుభ్రం చేయించి వాటికి తలుపులు వేయిస్తాం. బ్లీచింగ్ చల్లి ఫాగింగ్ చేయిస్తాం. కాలనీల్లోని కాలువల్లో వ్యర్థాలను తొలగించే పని ఇప్పటికే ప్రారంభించాం. మరో పది రోజుల్లో పూర్తిస్థాయిలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. **-వీరభద్రుడు, ఈవోపీఆర్డీ, ముద్దనూరు**

తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతానికి పిలుపు


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఈ నెల 26వ తేదీ జమ్మలమడుగులో నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రక్రియ విధి విధానాలపై వివరించారు. రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెదేపా ప్రభుత్వంతోనే మహిళాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో మెప్మా అర్బన్ మార్కెట్‌ను నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతో కలిసి ప్రారంభించారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ముకుందారెడ్డి

ముద్దనూరు న్యూస్‌టుడే: యామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో ముకుందారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు, ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డులో పేర్లు చిరునామా సరిచేసుకునే అవకాశం ఉందన్నారు.

దాడులు అరికట్టేందుకు ఐక్యవేదిక ఏర్పాటు

ప్రొద్దుటూరు పట్టణం : మహిళలపై దాడులు అరికట్టడం, మహిళల జీవించే హక్కును కాపాడేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించడం వంటి పరిస్థితుల మార్పునకు మహిళా సంఘాలు, మేధావులతో కలిసి మహిళా ఐక్యవేదికగా ఏర్పడ్డారు. గురువారం సాయంత్రం జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో ఐక్యవేదిక మహిళా నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో, ప్రజల్లో అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ మహిళా విభాగం నుంచి భారతి, జేవీవీ సమతా మహిళా విభాగం నుంచి ఉషారాణి, సునీత, విరసం ప్రతినిధి వరలక్ష్మి, రాయలసీమ మహిళా శక్తి సంఘం నుంచి లక్ష్మీదేవి, జమాతే ఇస్లాం మహిళా విభాగం నుంచి రేహేనా, హసీనా, రాయలసీమ విద్యార్థి శక్తి సంఘం నుంచి హరిత, చైతన్య మహిళా సంఘం నుంచి పద్మ, రాయలసీమ మహాసభ మహిళా విభాగం నుంచి రుక్సానాలు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

వైద్య ఉద్యోగుల సమస్యలపై వినతి


ఆర్డీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చాపాడు, న్యూస్‌టుడే: వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం కడప రీజినల్ డైరెక్టర్ రామిగడ్డయ్యకు సంఘ నాయకులు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

ప్లస్ టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు గ్రామీణ : ఉన్నత పాఠశాల ప్లస్ టు ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు రెండేళ్లుగా ఇంటర్ విద్యార్థులకు నిపుణులైనవారు బోధన చేయడం లేదన్నారు.

ధర్మవరం రైలును పొడిగించాలి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: మంచి పట్నం నుంచి ధర్మవరం వరకూ ఉన్న రైలు సర్వీసును బెంగళూరు వరకూ పొడిగించాలని భాజపా జిల్లా కార్యదర్శి ప్రొద్దుటూరుకు చెందిన అరకటవేముల హరినారాయణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఆ మేరకు విజయవాడలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. రైలు సర్వీసును సత్యసాయి జిల్లా పుట్టపర్తి మీదుగా బెంగళూరు వరకూ పొడిగించాలన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

బాధితులకు పరామర్శ

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రేమోన్మాది చేతిలో విద్యార్థినిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా బాధ్యుడు గుర్రప్ప, జిల్లా అధ్యక్షుడు జయరాం అన్నారు. గురువారం వారు స్థానిక నాయకులతో కలిసి బాధితులను పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు సుసిమిగోస్‌పేర్, బేబి ఏసోబు, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవనోపాధి పెంచండి

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలకలో విలీనమైన గ్రామాల్లో పేదల ఆర్థికజీవన ప్రమాణాలను పెంచాలని కమిషనర్ నరసింహారెడ్డి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బద్వేలు పురపాలక సభా భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద తరగతి కుటుంబాలను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలను అందించాలని సూచించారు. పదో తరగతి చదివిన నిరుద్యోగుల వివరాలను సేకరించాలని ఆదేశించారు.

ప్రతిభకు పట్టం

ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీ సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. అందులో ఎస్.జయచంద్రిక (10వ తరగతి), పి.నేహ (9వ తరగతి), వై.వెంకటలిఖిత (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్ శివచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు రాము విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు విద్య**


పోటీలకు హాజరైన విద్యార్థులు


విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ శివచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు రాము

పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రొద్దుటూరు పట్టణంలోని విద్యాధరి ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డి.గాయత్రి (9వ తరగతి), బి.మేఘన (10 తరగతి), జి.వెంకట మోక్షజ్ఞ (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ఛైర్మన్ దేవిప్రసాద్‌రెడ్డి, కరస్పాండెంట్ హేమలత, ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు విద్య**


పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందిస్తున్న పాఠశాల ఛైర్మన్ దేవిప్రసాద్‌రెడ్డి, కరస్పాండెంట్ హేమలత, హెచ్‌ఎం ప్రియాంక

బాలలు... కబడ్డీలో దిట్టలు

–న్యూస్‌టుడే, పోరుమామిళ్ల, ఖాజీపేట, రాజుపాళెం

గ్రామీణ క్రీడాకారులకు జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో నిలిచేలా బాలలు అహర్నిశలు కష్టపడుతున్నారు. పోరుమామిళ్ల మండలంలోని కవలకుంట్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీలో కూత పెడితే జట్టు గెలవాల్సిందే. ప్రధానోపాధ్యాయురాలు రామకృష్ణమ్మ, వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలు విజయ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతి రోజు కబడ్డీపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇటీవలే జరిగిన జోనల్ స్థాయి పోటీలు, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారు. జోనల్, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారు. కబడ్డీలో ప్రతి రోజూ సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచేందుకు సాధన చేస్తున్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన విజేతలు

సంతోషంగా ఉంది



కబడ్డీ అంటే చాలా ఇష్టం. ప్రతి రోజూ సాధన చేస్తున్నాం. జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మంచి ప్రతిభ చాటాను. రాష్ట్రస్థాయి పోటీలో నైపుణ్యం కనబరిచేందుకు మెలకువలు నేర్చుకుంటున్నాను. మా పీఈటీ ఉపాధ్యాయురాలు విజయ ప్రతి రోజూ మాకు కబడ్డీ ఆటను ప్రాక్టీస్ చేయిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. **-జ్యోతి**

రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలి



నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. మండల స్థాయిలో సిద్ధవరంలో, జోనల్ ఆటల పోటీలు బద్వేలు ఆడినాం. జిల్లా స్థాయిలో రాయచోటిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాను. మండలం నుంచి జిల్లా స్థాయి పోటీల్లో చక్కటి ప్రతి చాటినందుకు ఎంతో సంతోషంగా ఉంది. గ్రామీణ ప్రాంతం నుంచి జిల్లా స్థాయి పోటీల వరకూ వెళ్లి పాల్గొన్నాను. **-కావేరి**

గుర్తింపు వచ్చినందుకు ఆనందంగా ఉంది



ఒక జట్టు కబడ్డీ క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నందుకు ఆనందంగా ఉంది. పాఠశాలలో కబడ్డీకి ప్రతి రోజు సాధన చేస్తున్నాం. గ్రామీణ క్రీడాకారులకు జిల్లా స్థాయిలో ఆడటం మంచి గుర్తింపు. మండల, జోనల్ స్థాయి పోటీల్లో నా ప్రతిభ చూసి జట్టుకు ఎంపిక చేయడం అదృష్టంగా ఉంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకువస్తాను. **-సిద్దిక్‌బాషా**

మైలవరానికి నీటి విడుదల

కొండాపురం : గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయర్‌కు 6000 క్యూసెక్కుల నీటిని పంపుతున్నట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు గురువారం తెలిపారు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు ప్రస్తుతం 5500 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. అలాగే వర్షంనీరు 500 క్యూసెక్కుల నీరు గండికోటకు చేరుతున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి 12 వేల క్యూసెక్కుల నీటిని తరలించగా క్రమంగా తగ్గించి ప్రస్తుతం జలాశయంలోని రెండు గేట్ల ద్వారా ఆరు వేల క్యూసెక్కుల నీటిని మైలవరానికి పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 26.35 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ వివరించారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన


విద్యార్థులతో అధ్యాపకులు కృష్ణారెడ్డి, సుభాన్‌సాహెబ్

మైదుకూరు, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటన చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా కడపలోని యోగి వేమన విశ్వ విద్యాలయంలో బయో టెక్నాలజీ ప్రొఫెసర్ చంద్రమతి పర్యవేక్షణలో పుట్టగొడుగుల పెంపకం కేంద్రం, కణజాల వర్ధన ప్రయోగశాలను పరిశీలించారు. పుట్టగొడుగుల పెంపకంపై సాంకేతిక నిపుణుడు దిలీప్ వివిద దశలను చేసి చూపించారు.

అప్పుడేమో మౌనం... ఇప్పుడెందుకు మాటలు


గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఘటనను చరవాణిలో చూపిస్తున్న రితేష్‌రెడ్డి, భాజపా నాయకులు

బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో జరిగిన అఘాయిత్యాలపై మౌనంవహించి ఇటీవల బద్వేలులో జరిగిన ఘటనపై ఎందుకు మాట్లాడుతున్నారని తెదేపా సమన్వయకర్త రితేష్‌రెడ్డి, భాజపా నాయకుడు బొజ్జ రోశన్న ధ్వజమెత్తారు. ఇటీవల బద్వేలులో జరిగిన విద్యార్థిని హత్యోదంతం దర్యాప్తుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపడుతూ ఎమ్మెల్యే దాసరి సుధ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తూ గురువారం రితేష్‌రెడ్డి, రోశన్న మీడియాతో మాట్లాడారు. బికోడూరు ఓ విద్యార్థినిని దారుణంగా హత్య చేసినప్పుడు ఈ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై అవాస్తవాలు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఇప్పుడు జరిగిన విద్యార్థినిని కుటుంబాన్ని ఆదుకోవాలి కానీ. రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. ఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించి నిందితుడిని అదే రోజు పట్టుకునే విధంగా పోలీసు అధికారులను ఆదేశించారని, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆ కుటుంబానికి రూ.5 నుంచి రూ.10 లక్షలు సాయాన్ని పెంచి అందజేశారన్నారు. ఇంటిలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, విద్యార్థికి మాడల్ స్కూల్లో చదువు చెప్పించే చర్యలు తీసుకున్నారని అన్నారు. బాధితుల ఇంటికి పరామర్శించేందుకు తానొస్తున్నానని తెలిసి వెనువెంటనే సాయం అందించారని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కూటమి నాయకులు రామచంద్రారెడ్డి, వెంగళ్‌రెడ్డి, గోడి రమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, విజయకుమార్, మహబుబ్‌బాషా, నాగభూషణం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కలశాల మహోత్సవం

పెద్దముడియం : జంగాలపల్లెలో దస్తగిరిస్వామి జెండా పండగను గురువారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. దర్గాను ప్రత్యేక విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పాటక చేరి, కీలు గుర్రాల నృత్యం అందరినీ ఆకట్టుకుంది. రాత్రి కలశాలతో ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎస్సై సుబ్బారావు బందోబస్తు చర్యలు చేపట్టారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ దీపావళి పండగను సంతోషంగా జరుపుకోవాలని ఆర్డీవో సాయిశ్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. టపాసులు దుకాణాల ఏర్పాటు విషయంలో గురువారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల నుంచి టపాసుల దుకాణాల ఏర్పాటు కోసం 116 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎక్కువగా ప్రొద్దుటూరు నుంచి 55, జమ్మలమడుగు 16, ఎర్రగుంట్ల 19 దరఖాస్తులు వచ్చాయన్నారు.

పోలీసుల ఔదార్యం

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని గిద్దలూరు ప్రధాన రహదారిలోని శింగరాయపల్లె వద్ద నుంచి గంగాయపల్లె వరకు పలుచోట్ల రహదారిని ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న చెట్లు, పిచ్చిమొక్కలను గురువారం సీఐ డి.శ్రీనివాసులు, ఎస్సై చిరంజీవి తీయించారు. ఈ నెల 23న శింగరాయల్లె వద్ద రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసులు, ఎస్సై చిరంజీవి పరిశీలించారు. వారు మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకొన్నారు.

రహదారులు అస్తవ్యస్తం

మురుగు తొలగక అవస్థలు

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ప్రొద్దుటూరు పురపాలక సంఘ పరిధిలో బుడ్డాయపల్లె, పొట్టిపాడురోడ్డు, వైఎస్ నగర్‌కాలనీ, బాకరాపేటవీధి తదితర ప్రాంతాలు ఉన్నాయి. పొట్టిపాడురోడ్డులో రోడ్డు భవనాల శాఖకు చెందిన రోడ్డు దెబ్బతింది. పొట్టిపాడురోడ్డులో ఉన్న పెద్దమ్మచెట్టుకు సమీపంలోని వీధిలో కొన్ని ఇళ్లకు తాగునీరు సరిగారావడం లేదు. దీంతో వాటర్‌ట్యాంకర్ ద్వారా నీటిని నిల్వ చేసుకుంటున్నారు. తాగునీరు దుర్వాసనతో పాటు నీరు రంగు మారివస్తుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పొట్టిపాడురోడ్డులో కాలువలు చాలా ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో అస్తవ్యస్తంగా మారాయి. వర్షాకాలంలో నీరంతా మురుగుగా మారి రోడ్డుపై పారుతోంది. పూడిక సకాలంలో తొలగించడం లేదు. వైఎస్‌నగర్‌కాలనీలో ఎప్పుడు పూడిక తొలగిస్తారో అర్థం కానిపరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం వస్తే నీరు పారే మార్గం లేదు. బాకరాపేటవీధిలో కొన్ని ప్రాంతాల్లో పురపాలక సంఘం తాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా ఉంది. వైకాపా పాలనలో నూతన తాగునీటి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పైపులైన్‌ను ఏర్పాటు చేసినా కొద్ది మాసాల నుంచి అర్ధరాత్రి వేళలో తాగునీరు పంపిణీ అవుతోంది. నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని ఆ ప్రాంతవాసులు చెప్పారు. కాలువల్లో పూడిక తీత మూడు మాసాల నుంచి సక్రమంగా తొలగించడం లేదు. దుర్వాసనలతో, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. శాస్త్రినగర్‌లోని కాలువల్లో మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం లేదు. ఈ సమస్యలపై ఆర్ అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ నూతన తాగునీటి పైపులైన్ వలన ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సకాలంలో నిర్వహిస్తున్నామన్నారు. మొదటి డివిజన్ పారిశుద్ధ్య అధికారి నూర్‌బాషా మాట్లాడుతూ పొట్టిపాడురోడ్డులో నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపామని చెప్పారు.


దెబ్బతిన్న పొట్టిరోడ్డు

తాగునీరు సక్రమంగా రావడం లేదు



మా వీధిలో తాగునీరు సక్రమంగా రావడం లేదు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. సకాలంలో కాలువల్లో పూడిక తొలగించడం లేదు. **-బాషా, మేస్త్రీ, స్థానికుడు**

దుర్వాసన వస్తోంది



మా వీధిలో తాగునీరు దుర్వాసన వస్తోంది. కొద్ది రోజుల నుంచి ఈ పరిస్థితి ఉంది. పురపాలక సంఘం పంపిణీ అయ్యే నీరు రంగుమారుతోంది. **-లక్ష్మీదేవి, స్థానికురాలు**

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు



పులివెందుల సబ్‌జైలు ప్రాంగణంలో అధికారులతో మాట్లాడుతున్న జడ్జి ఫక్రుద్దీన్

పులివెందుల, (వేంపల్లె), న్యూస్‌టుడే: సబ్‌జైలులోని ఖైదీల కోసం లీగల్‌ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం ఆయన పులివెందుల సబ్‌జైలును సందర్శించారు. ఇక్కడున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. జైలు లోపల ఉన్న ఖైదీలు తమ హక్కులు, ఉచిత న్యాయసహాయం కోసం ఈ క్లినిక్‌లను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల సబ్‌జైలు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి



అధికారులకు సూచలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

బిల్టప్, న్యూస్‌టుడే: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. గురువారం నగరంలోని అల్మాస్‌పేట, రైతుబజార్, పక్కీర్‌పల్లి, ఆర్టీసీ కాలనీ, అశోక్ నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. రైతు బజార్‌లో చెత్త నిల్వలను తరలించాలని, అశోక్ నగర్‌లో స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులతో గౌరవంగా మాట్లాడండి



ఒకటో పట్టణ ఠాణాలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, పక్కన సీఐ రామకృష్ణ

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణాను గురువారం డీఎస్పీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. పలు దస్త్రాలను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఠాణాకు వచ్చే బాధితులతో పోలీసులు గౌరవంగా మాట్లాడాలన్నారు. పెద్ద కేసే తప్పించుకోకుండా చూడాలని సూచించారు. రాత్రి వేళల్లో చోరీలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ సీఐ రామకృష్ణ ఉన్నారు.

చోరీ ఘటనపై ముమ్మర దర్యాప్తు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో 55 తులాల బంగారు నగలు చోరీ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. వేలిముద్రలను సేకరించారు. ఇది దొంగల పనా లేదా ఎవరైనా తెలిసిన వారు చేశారా అనే కోణంలో కూడా ఆరాతీస్తున్నారు.

కాలభైరవస్వామికి పూజలు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలో బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలభైరవస్వామి దేవస్థానాన్ని గురువారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి సందర్శించారు. స్వామివారికి అభిషేకం, కుష్మాండదీపసేవారాధన సేవ శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాసట సమ్యద్ధ కార్తీక్ రెడ్డి ఆమెను సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. చంద్రమౌళిరెడ్డి, పురుషోత్తమరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య సమావేశం

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని టక్కోలు గ్రామ సచివాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక పంచాయతీ సర్వసభ్య సమావేశం పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. ఇటీవల నూతన సర్పంచిగా లక్ష్మీదేవి ఎన్నిక కాగా, మొదటిసారిగా సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. రూ.6 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని సభ్యులు ఆమోదం తెలిపినట్లు గ్రామ కార్యదర్శి శివయ్య తెలిపారు. తెదేపా నాయకులు నాగముని రెడ్డి, సాంబశివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలి

సిద్దవటం, న్యూస్‌టుడే: విద్యార్థులు అన్ని రంగాలపై అవగాహన పెంచుకొని ఉజ్వల భవితకు బాట వేసుకోవాలని సిద్దవటం ఎస్సై చిరంజీవి, సిద్దవటం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం సిద్దవటం ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కమలాపురం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ రోషన్, ఎస్సై ప్రతాప్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విద్యార్థులకు బాలుర, బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో భైరవేశ్వరస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చింతా రవిశంకర్‌రెడ్డి(49) అనే వ్యక్తి మృతి చెందారు. మండలంలోని మొలకవారిపల్లెకు చెందిన రవిశంకర్‌రెడ్డి మండలంలోని నల్లింగాయపల్లెలోని బారైటీస్ సిమెంటు పరిశ్రమలో ఫొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని గురువారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. అతనికి తీవ్రగాయాలు కావడంతో కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవిశంకర్‌రెడ్డికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

శ్మశాన స్థలాన్ని కాపాడండి



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయనోరిపల్లె వాసులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: నాయనోరిపల్లెలో శ్మశాన స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులు గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇటీవల కొందరు శ్మశానవాటిక స్థలం తమదంటూ స్థానికులను బెదిరిస్తున్నారు. దీంతో తాము తమకు న్యాయం చేయాలని తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. తెదేపా నాయకుడు ఏటూరు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నగదు వితరణ

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందులలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి సొంత భవన నిర్మాణానికి దక్షిణామూర్తి రూ.20వేల చెక్కును గురువారం అందజేశారు. పట్టణంలో సేవాసమితి అధ్యక్షుడు రాజు చెక్కు అందించారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్నీషియన్ హరీష్, సభ్యులు పరందామరెడ్డి పాల్గొన్నారు.

గోవిందా... గోవిందా!

ఆ రోడ్డులో వెళితే దుమ్ము కొట్టుకుపోవడమే!



మార్కెట్‌యార్డు సమీపంలో దమ్మురేగుతూ...

న్యూస్‌టుడే, దేవునికడప

దుమ్ము.. ధూళి.. ఇరుకు.. పూర్తికాని విస్తరణ, కొంతమేర ప్రారంభమైన పనులు... ఇదీ తిరుమల తొలిగడప దేవునికడపకు వెళ్లే రోడ్డు దుస్థితి. దీంతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు. వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవాలు, ఇతర పర్వదినాలు, వేడుకలు జరిగే సమయాల్లో వేలాది మంది ఆలయానికి వస్తుంటారు. కడప నగరం నుంచి ఇక్కడకు వచ్చే మార్గం అత్యంత దారుణంగా ఉంది. ఇరువైపు మార్కెట్ యార్డు, పొలాలు... గోదాం ఉండటంతో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఈ రోడ్డు విస్తరణ చేపట్టినా మాసాపేట కూడలి తర్వాత అసంపూర్తిగా వదిలేశారు. అమీర్ థియేటర్ వరకూ గుంతలతో కంకర తేలి ఉంది. మార్కెట్ యార్డు సమీపంలో కూడలి ఏర్పాటు చేసి, అతిపెద్ద దిగా నిర్మాణం చేపట్టారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో పడగొట్టి, మళ్లీ కదిలించి నిర్మాణం చేపట్టారు. పనులు నిలిచిపోవడంతో రాళ్లు తేలి ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. అమీర్ థియేటర్ దాటిన తర్వాత విస్తరించలేదు. అక్కడి నుంచి బైపాస్ రోడ్డు వరకూ పూర్తిగా సింగిల్ రోడ్డే ఉంది. దేవునికడపలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద చాలా ఇరుగ్గా ఉంది. విస్తరణ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వేలామంది ప్రయాణించే ఈ రోడ్డు పనులు బైపాస్ వరకూ విస్తరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మాసాపేట కూడలి సమీపంలో గుంతలతో అసంపూర్తిగా రోడ్డు

కళ్లు మండుతున్నాయి



రోడ్డు విస్తరణ పనులు చాలాకాలం మొదలై జరుగుతూనే ఉన్నాయి. ఎప్పుడు పూర్తిచేస్తారో తెలియడం లేదు. రోడ్డంతా గుంతలే. పెద్ద పెద్ద వాహనాలు వెళుతుంటే దుమ్ము రేగి, వెనకాల వచ్చే వారి కళ్లు మండుతున్నాయి. మార్కెట్ యార్డు వద్ద కూడలి నిర్మాణం చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు త్వరగా పూర్తిచేయాలి. **- భీమయ్య, మాసాపేట**

సీఎం సహాయ నిధి పేదలకు వరం



బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల, (వేంపల్లె), న్యూస్‌టుడే : పేదలకు అత్యుత్తమ వైద్యం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పులివెందుల బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. పులివెందులలోని తెదేపా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేంపల్లె మండలం నందిపల్లెకు చెందిన కొత్తూరు జయరామిరెడ్డి, వేంపల్లెకు చెందిన సుబ్బారావుతోపాటు మరికొందరికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తూ తొలగింపునకు గురైన నందిపల్లెవాసి తుపాకుల గంగరెడ్డికి బీటెక్ రవి తిరిగి పోస్టింగ్ ఇప్పించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, జిల్లా తెలుగుయువత మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, కత్తూలూరు మాజీ సర్పంచి వీరలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పక్కదారి పట్టకుండా చర్యలకు వినతి

వేంపల్లె, న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ కోరారు. గురువారం తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో నదుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని సీఎం చంద్రబాబుఆదేశాలు జారీ చేశారన్నారు. దీన్ని అదునుగా భావించి కొందరు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను పాపఘ్ని నది నుంచి తీసుకెళ్లి నిల్వ చేసుకుంటున్నారన్నారు. ఇసుక పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తెదేపా నాయకులు పీవీ రమణ, ఫయాజ్, షరీఫ్, ఇలియాస్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రెడ్డిసేవా సమితి వార్షికోత్సవాల్లో భాగంగా వేమన పద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్డిసేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులు సంబంధిత ప్రధానోపాధ్యాయులతో వయసు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. అందులో భాగంగా నవంబరు 9న ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గాల విద్యార్థులకు ప్రొద్దుటూరు టౌన్ హాలులో, 10న రాజంపేట, కోడూరు, రాయచోటి నియోజకవర్గాలకు సంబంధించి రాజంపేటలో, 17న కడప, బద్వేలు, కమలాపురం నియోజకవర్గాల వారికి కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో పోటీలు జరుగుతాయని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: బేడ, బుడగ జంగాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దూపం రాజు కోరారు. దీనిపై గురువారం ఎమ్మెల్యే మాధవికి వినతి పత్రం అందించారు. రాజు మాట్లాడుతూ తెలంగాణలో మాత్రమే తమను ఎస్సీ జాబితాలో చేర్చారని, ఏపీలో చేర్చకపోవడంతో రిజర్వేషన్లు లేక నష్టపోతున్నామని, సురేష్, మల్లి, లోకేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

చెన్నూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శివాలపల్లె గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉండి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో కిరణ్ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని ఉప్పరపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. అనంతరం సమీపంలోని శివాలపల్లె సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. పంచాయతీ కార్యదర్శి అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని బీసీ బాలికల వసతిగృహం వానకు ఉరుస్తూ ప్రమాదకరంగా మారింది. వసతిగృహంలో మొత్తం 130 మంది ఇంటర్, నర్సింగ్ విద్యార్థినులు ఉంటున్నారు. అసలే పాత భవనం కావడంతో ఎక్కడ కూలుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై వసతిగృహం వార్డెన్ ఆరోగ్య మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడల్లా వసతిగృహం గోడలన్నీ నెమ్ము దిగుతాయని, స్లాబు పైనుంచి నీళ్లు కారకుండా సిమెంటు వేయించానని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశామని చెప్పారు. **- న్యూస్‌టుడే, మారుతీనగర్**

మురుగుకాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోండి

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : పట్టణ పరిధి పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మురుగు కాలువ సమస్య ఉందని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి, రాష్ట్రీయ శివాజీసేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం అందజేశారు. కాలువ దెబ్బతినడంతో ఆలయంలోకి మురుగు నీరు ప్రవేశిస్తోందని, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం గంగరాజు, పీడీ వెంకటసుబ్బయ్య

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని చింతరాజుపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి. గంగరాజు, వ్యాయామ డైరెక్టర్ పి.వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. నెట్‌బాల్‌లో ఎం.విజయ్, బి.రమ్య, టి.సుచిత్ర, రోహిణి, అభిలాష్, బాస్కెట్‌బాల్‌లో జి.ఓబయ్య, బి.లావణ్య, గౌతమ్ ప్రతిభ చాటారని చెప్పారు. వారిని హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని అంగడివీధి పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రికెట్‌లో మోక్షజ్ఞ, ఖోఖోలో యువరాజ్, కబడ్డీలో మరియమ్మ సత్తా చాటారని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యాయమోపాధ్యాయుడు అగ్గిరప్ప తెలిపారు. వారిని గురువారం అభినందించారు.

త్వరలో రైల్వే పైవంతెన పనుల ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే: కాలనీల్లోని సమస్యలు తెలిపిన ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని ఛైర్ పర్సన్ మేరి అధ్యక్షతన, కమిషనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే పైవంతెనకు సంబంధించి భూసేకరణలో బాధితులకు చెల్లించేందుకు రూ.24 కోట్లు మంజూరైందని వెల్లడించారు. ఈ ఏడాదిలో వంతెన పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పాగేరులో కొత్త వంతెన నిర్మించేందుకు రూ.45 లక్షలతో ఆర్ అండ్ బీ అధికారులు ప్రతిపాదనలు పంపారన్నారు. ఇళ్లు, కుళాయి పన్నుల వసూలుకు సభ్యులు సహకరించాలని కమిషనర్ కోరగా, ఎమ్మెల్యే స్పందిస్తూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయించి, కుళాయిలకు నీరు అందిస్తే ప్రజలు తప్పకుండా పన్నులు చెల్లిస్తారని పేర్కొన్నారు. దోమల బెడద ఎక్కువైందని పలువురు కౌన్సిలర్లు చెప్పగా, వెంటనే ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. తొలుత పలు అభివృద్ధి పనులను ఆమోదం తెలిపారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ అందేలా కృషి

వరి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పెట్టుబడిరాయితీ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి పంట దెబ్బతింది. మండలంలోని గంగవరం పొలాల్లో నేలకొరిగి మొసులొచ్చిన పంటను గురువారం ఆయన అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 1149 మంది రైతులకు చెందిన 2 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితులను ఆదుకుంటామని పేర్కొన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏవో సరస్వతి, తహసీల్దార్ శివరామిరెడ్డి, భాజపా మండల కన్వీనర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, తెదేపా నాయకులు ప్రసాద్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో రాణించాలి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: కడప నగర శివారులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మానవ అక్రమ రవాణా నిరోధక శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంత ఆధ్వర్యంలో మహిళల సంరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, మహిళలు స్వశక్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి మళ్లింపునకు పోలీసుల చొరవ

కమలాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పాఠశాల హెచ్‌ఎం ఖాజాపర్వీన్ ఎస్సై ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. గురువారం జేసీబీతో కాలువ తీయించి నీటిని బయటకు పంపించే పనులు చేపట్టారు.

కాలువల బాగుజేతకు శ్రీకారం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని వెంకటగారిపల్లె సమీపంలో కాలువల బాగుజేతకు గురువారం అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో జేసీబీతో పనులు ప్రారంభించారు. ఈఈ శ్రీనివాసులురెడ్డి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, ఏఈ ప్రతాప్ ఉన్నారు.

సీడీపీవోను సస్పెండ్ చేయాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తను వేధించి, ఆమె అనారోగ్యానికి కారణమైన సీడీపీవోపై చర్యలు తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి చంద్రారెడ్డి డిమాండు చేశారు. స్థానిక రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తను అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి బృందంతో కలిసి పరామర్శించారు.

భూ కబ్జాకు అడ్డుకట్ట

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని శేఖరాజుపల్లె పరిధి మోహిదీన్‌సాహెబ్‌పల్లెలోని జగనన్న కాలనీ సమీపంలో సర్వే సంఖ్య 246లోని ఎకరా ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి యంత్రంతో చదును పనులు చేపట్టారు. దీనిపై రెవెన్యూ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో గ్రామ సచివాలయ సర్వేయర్ పవన్, వీఆర్ఏ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలానికి వెళ్లి కబ్జాను అడ్డుకున్నారు. పనులు కొనసాగకుండా యంత్రాలను వెనక్కు పంపారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట ఎస్సీ కాలనీలో మాతమ్మ విగ్రహం ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని ఇటీవల పునర్నిర్మాణం చేపట్టారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం గ్రామోత్సవం జరిగింది. ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నోటీసు

కడప జిల్లా, కడప కార్పొరేషన్, వై.వి.స్ట్రీట్, డి.నెం. 13/595 నివాసి అయిన జి.సరస్వతమ్మ, భర్త జి.సుబ్బరాయుడు చెట్టి వారికి మా క్లయింట్ అయిన శ్రీ పి.జయభారతరెడ్డి, ప్రెసిడెంట్ : ది కడప కో- ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లి॥ వారు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్ మేరకు ఇచ్చు పబ్లిక్ నోటీసు.

పై తెలిపిన సొసైటీలో మెంబరుగా ఉన్న మీకు ప్రతాప్ కో- ఆపరేటివ్ కాలనీలో ప్లాట్ నెం. 13 1991లో అలాట్‌మెంట్ కాబడి ఉన్నది. అది మొదలు రిజిస్ట్రేషన్ కొరకు మీకు ఎన్నిమార్లు రిమైండర్లు పంపిన మీ నుంచి ఏలాంటి స్పందన లేదు. కావున ఈ నోటీసు చూసిన **15 దినములలోగా** మీరు కో- ఆపరేటివ్ కాలనీలోని ఆఫీసు వద్దకు వచ్చి, సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు. లేని యెడల మీకు అలాట్ కాబడిన ప్లాట్ నెం. 13 మరియొక మెంబరుకు అలాట్ చేయబడును. మీరు కట్టిన రుసుము మరియు రొక్కము ఫోర్‌ఫీట్ చేయబడును.

P.S. Balasubrahmanyam, B.Com., B.L.,
Advocate, L.I.G.H -II-214, APHB Colony,
Kadapa - 516004.

పరిసరాలు అపరిశుభ్రం... దోమలతో సతమతం



సొసైటీ కాలనీలోని ఓ వీధిలో నిలిచిన మురుగు

కమలాపురం, న్యూస్‌టుడే : కమలాపురం వాసులు మౌలిక వసతుల లేమితో సతమతమవుతున్నారు. నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో సుమారు 24 వేల మంది నివసిస్తున్నారు. సొసైటీ కాలనీ, బీడీ కాలనీ, మారుతీనగర్, పడమర వీధి, ఫక్కీరు వీధి, కృష్ణానగర్, తెలుగువీధి, గండ్లూరు కాలనీ, అంధుల కాలనీ, కె.అప్పాయపల్లె, అక్సానగర్, ఇందిరమ్మకాలనీ, రెడ్డికాలనీ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, హైడిమాన్ కాలనీ, ఎంపీడీవో కాలనీలతో పాటు పలు కాలనీల్లో సుమారు 1100 ఖాళీ స్థలాలున్నాయి. వర్షాకాలంలో ఇక్కడ మురుగు నిల్వ ఉంటోంది. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు వ్యాపిస్తున్నాయి. దీనికి తోడు పందులు మురుగునీటిలో స్వైరవిహారం చేస్తున్నాయి. గత వైకాపా పాలనలో ఓపెన్ డ్రైనేజీ పనులు మధ్యలోనే వదిలేయడంతో మురుగు ముందుకు పారక రోడ్లపైకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ సిబ్బంది నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

అధ్వానంగా పారిశుద్ధ్యం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపైకి మురుగు చేరుతుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయింది.

నివారణకు చర్యలు

నగర పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. క్రమం తప్పకుండా ఫాగింగ్, రసాయన మందులు పిచికారీ చేస్తాం. కాలువల్లో వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు చేపడతాం.

- జగన్నాథ్, కమలాపురం నగర పంచాయతీ కమిషనర్